క్లుప్తంగా

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఏడీ



పొగాకు పంటను పరిశీలిస్తున్న ఏడీ, ఏవో

ఒంగోలు రూరల్: మండలంలోని గుత్తిగొండి వారిపాలెంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పొగాకు, శనగ పంటలను ఏడీ రమేష్, ఏవో కిషోర్‌బాబు, డీఆర్‌డీ ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. రైతులు ఏ మేరకు నష్టపోయారో అంచనాలు రూపొందించారు. అనంతరం గుత్తిగొండివారిపాలెంలో నిర్వహించిన సమావేశంలో రైతులతో ఏడీ రమేష్‌బాబు మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న అన్ని రకాల పంటలను శుక్రవారం పరిశీలించామన్నారు. నష్టంపై ప్రభుత్వానికి స్పష్టమైన నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. ఒంగోలు మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పొగాకు తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన ఎరువుల గురించి తెలియజేశారు. 50 శాతం సబ్సిడీతో జేజే 11, కాక్ 2 విత్తనాలను రైతులకు వేగంగా సరఫరా చేయనున్నట్లు తెలిపారు. వరి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు రాయితీలపై అవగాహన కల్పించారు.

శివముక్కోటి సందర్భంగా ప్రత్యేక పూజలు



నగరోత్సవానికి బయలుదేరుతున్న స్వామివారు

ఒంగోలు: స్థానిక కేశవస్వామిపేటలోని శ్రీగంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శివ ముక్కోటి (ఆరుద్రోత్సవం) సందర్భంగా స్వామివారికి శుక్రవారం తెల్లవారుజామున మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి స్వామివారి ద్వార దర్శనం, 9 గంటలకు నగరోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి నిర్వహించిన విశేష అభిషేకాలను దర్శించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, ఆలయ చైర్మన్ ఈదుపల్లి గురునాథం, కార్యనిర్వహణాధికారి రజనీకుమారి, ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, అర్చకులు శంకరమంచి ప్రసాదశాస్త్రి, శంకరమంచి రామకృష్ణ పాల్గొన్నారు.

మోటార్లు చోరీ

టంగుటూరు: రక్షిత మంచినీటి పైపులైను మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన మండలంలోని కారుమంచి గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కారుమంచి గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకుకు చెరువు నుంచి నీరందించి గ్రామ ప్రజలకు సరఫరా చేస్తుంటారు. ఈ క్రమంలో పంచాయతీ సిబ్బంది శుక్రవారం తెల్లవారుజామున నీటిని పంపిణీ చేసేందుకు ఒక మోటారు వద్దకు రాగా కనిపించలేదు. అక్కడి నుంచి మరో మోటారు నుంచి నీరందించడానికి వెళ్లగా అది కూడా అదృశ్యమైంది. దీంతో రెండు మోటార్లు చోరీకి గురైనట్లు నిర్ధారించుకుని గ్రామ సర్పంచ్ మన్నం శ్రీనివాసుకు, సచివాలయ కార్యదర్శి రామకృష్ణకు సమాచారం అందించారు. చోరీకి గురైన మోటార్ల విలువ రూ.లక్ష ఉంటుందని పంచాయతీ కార్యదర్శి పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు

తిరుపతికి వెళ్లి పింఛన్ పంపిణీ

బేస్తవారిపేట: మండలంలోని శింగసానిపల్లెకు చెందిన మండ్ల రాజేశ్వరీ తిరుపతిలోని స్విమ్స్ వైద్యశాలలో కిడ్నీ డయాలసిస్ చేయించుకుంటోంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు కోనపల్లె సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రవీంద్రరెడ్డి అక్కడకు వెళ్లి రూ.10 వేల పింఛన్ నగదు అందజేశారు.

మభ్యపెట్టడం.. మోసగించడం ఇక చెల్లదు

- మాజీ ఎమ్మెల్యే దామచర్లపై కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ఆగ్రహం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు

ఒంగోలు: మభ్యపెట్టడం.. మోసగించడం టీడీపీ నైజమని, కానీ, ఇక అది చెల్లని రూపాయని మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌పై కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ఫైర్ అయ్యారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2004లో సునామీ వచ్చినప్పుడు తీర ప్రాంతాల ప్రజలను తక్షణమే ఆదుకునేందుకు అవసరమైన రహదారులు ఉండాలని పేర్కొంటూ 2005లో కేంద్ర ప్రభుత్వం తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలకు నిధులు కేటాయించిందన్నారు. అప్పట్లో తొలుత తమిళనాడుకు నిధులు విడుదలయ్యాయని, అనంతరం ఏపీకి రోడ్లు ప్రకటించడం జరిగిందని గుర్తుచేశారు. దురదృష్టవశాత్తూ వైఎస్ రాజశేఖరరెడ్డి మరణంతో రాష్ట్రంలో పనులు మందగించాయని తెలిపారు. తన గొప్పగా జనార్దన్ చెప్పుకుంటున్న బ్రిడ్జిలన్నీ కూడా కాంగ్రెస్ హయాంలో కేటాయించినవేనని, అందులో టీడీపీ గొప్పదనం ఏమీ లేదని వివరించారు. బకింగ్ హాం కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయకుండా కాంట్రాక్టర్ ద్వారా జనార్దన్ అడ్డుపడుతున్నారన్నారు. చేతనైతే ప్రజలకు మంచి చేయాలి తప్ప అడ్డుకోవడం ఏమిటంటూ అంజిరెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ కొత్తపట్నం మండల అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రారెడ్డి మాట్లాడుతూ కొత్తపట్నం మండలంలో మూడున్నర సంవత్సరాల వైఎస్సార్ సీపీ పాలనలో వందకోట్ల రూపాయలకుపైగా అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. టీడీపీ హయాంలో ఎన్ని పనులు చేశారో కూడా స్పష్టంగా ప్రకటించాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏం చేసినా శాశ్వతంగా నిలిచిపోయేలా చేసిందన్నారు. కొత్తపట్నం, ఈతముక్కల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలిస్తే ఆ విషయం అర్థమవుతుందన్నారు. అద్భుతమైన ఆలయాల్లా పాఠశాలలు మారిపోయాయన్నారు. నేడు ప్రతి గడపకు సంక్షేమ పథకం అందుతుంటే.. అబద్ధాలు చెప్పి ప్రజలను నమ్మించాలని టీడీపీ నేతలు చూస్తున్నారన్నారు. బకింగ్ హాం కెనాల్ పనులు 40 శాతం మాత్రమే చేసి నేడు 80 శాతం చేశామని జనార్దన్ చెబుతుండటాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. బకింగ్ హాం కెనాల్ బ్రిడ్జి కింద ఓడలు వెళ్లేలా డిజైన్లు మార్పుచేయడం వలన కొంత జాప్యం జరిగిందని, కాంట్రాక్టర్ వివరాలు అప్‌లోడ్ చేయడంలో జరిగిన నిర్లక్ష్యం కారణంగా కేంద్రం నిధులు నిలిచిపోయాయని అన్నారు. కరోనా కారణంగా రెండు సంవత్సరాల పాటు పనులు సాగకపోయినా నేడు మరో 50 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పనులు కూడా పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్ ముందుకొస్తే అతని సమస్య తీర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కేవలం సాంకేతిక కారణాల పేరుతో ఏదో ఒక విధంగా బ్రిడ్జి నిర్మాణాన్ని అడ్డుకోవాలనుకుంటున్న కాంట్రాక్టర్, దామచర్ల వైఖరి సరికాదన్నారు. కొత్తపట్నం మండల మాజీ అధ్యక్షుడు వాయల మోహన్‌రావు మాట్లాడుతూ జాతీయ విపత్తుల కేంద్రం 2015లో పనులు మంజూరు చేస్తే.. 2016లో అగ్రిమెంట్ చేసుకున్నారని, 2017లో శంకుస్థాపనలు చేశారని తెలిపారు. టీడీపీ హయాంలో రూ.8.41 కోట్ల పనులు జరిగితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇప్పటికే రూ.8.60 కోట్ల పనులు జరిగాయన్నారు. ఏదిఏమైనా బ్రిడ్జి నిర్మాణానికి సహకరించకుండా కాంట్రాక్టర్, పనులు జరగకూడదనే ఉద్దేశంతో మాజీ ఎమ్మెల్యే జనార్దన్ వ్యవహరించడం సరికాదన్నారు. కేవలం కందుకూరు, గుంటూరు టీడీపీ సభల్లో తొక్కిసలాటలు జరిగి ప్రాణాలు కోల్పోయిన ప్రజల వ్యవహారాన్ని కప్పిపుచ్చుకునేందుకు బకింగ్‌హాం కెనాల్ వద్ద టీడీపీ ఆధ్వర్యంలో ధర్నా చేశారని విమర్శించారు. సమావేశంలో కొత్తపట్నం మండల మాజీ అధ్యక్షుడు బలగాని శ్రీనివాసరావు, నాయకులు వీరారెడ్డి, ఎంపీటీసీ శాంతారావు, ఒంగోలు సూపర్‌బజార్ డైరెక్టర్ శంకరారెడ్డి, రోశయ్య పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి



లే అవుట్లను పరిశీలిస్తున్న అర్చన

అల్లూరు (కొత్తపట్నం): గృహ నిర్మాణాలను ఈ నెలాఖరుకు పూర్తి చేసి గృహ ప్రవేశం చేయాలని మండల ప్రత్యేక అధికారి జి.అర్చన లబ్ధిదారులకు సూచించారు. అల్లూరులోని జగనన్న లే అవుట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఇంటి నిర్మాణం చేపట్టకపోవడానికి కారణాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో ఇచ్చిన పట్టాలలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, లేకపోతే పట్టాలను మరొకరికి ఇస్తామని హెచ్చరించారు. లబ్ధిదారులకు కావాల్సిన సిమెంట్, ఇనుము, కిటికీలు సరఫరా చేస్తామన్నారు. డ్వాక్రా గ్రూపు వారికి బేస్‌మట్టంకు రూ.35 వేలు కూడా బ్యాంక్ నుంచి ఇప్పిస్తామన్నారు. లే అవుట్లలో మౌలిక వసతులు కూడా ఏర్పాటు చేశామని, బేస్‌మట్టం వేయని వారు ఉంటే వెంటనే ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నాంచార్లరెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో రత్నజ్యోత్స్న, సర్పంచ్ నంబూరి సూర్యనారాయణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పనితీరు పారదర్శకంగా ఉండాలి

- వార్డు సచివాలయాలను తనిఖీ చేసిన నగర కమిషనర్ వెంకటేశ్వరరావు



సచివాలయ సిబ్బందిని వివరాలడిగి తెలుసుకుంటున్న ఒంగోలు నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: జగనన్న భూ హక్కు పత్రాల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని త్రోవగుంట, అంబేడ్కర్‌నగర్‌తో పాటు పలు వార్డు సచివాలయాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. కంప్యూటర్లలో జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలకు సంబంధించిన పురోగతిని పరిశీలించారు. పీవోఎల్ఆర్ డేటాను కూడా పరిశీలించి నిర్వహించాల్సిన విధానాల గురించి సిబ్బందికి వివరించారు. అందులో భాగంగా వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ప్లానర్స్‌కు, అడ్మిన్లకు పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు.

తిరుమల భక్తులకు బాలినేని అన్నదానం



తిరుమల వెళ్తున్న భక్తులకు అన్నదానం చేస్తున్న బాలినేని శచీదేవి, పాల్గొన్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: వైకుంఠ ఏకాదశి సందర్భంగా వెనుకబడిన వర్గాల వారికి తిరుమల తిరుపతి దేవస్థానం ఉచితంగా తిరుమల శ్రీవారి దర్శనభాగ్యం కల్పించింది. ఆ భక్తులకు మార్గం మధ్యలో ఉచిత భోజన సదుపాయాన్ని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేశారు. అందులో భాగంగా శుక్రవారం స్థానిక పీఎల్ఆర్ కల్యాణ మండపంలో బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి శచీదేవి నగర మేయర్ గంగాడ సుజాతతో కలిసి స్వయంగా భక్తులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మీడియాతో శచీదేవి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని తమకు వెంకటేశ్వరస్వామి కల్పించిన అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ప్రతి ఆరునెలలకు ఒకసారి శ్రీవారి దర్శనం కోసం ఈ భక్తులు వెళుతుంటారని, వారికి అన్నదానం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రజలందరిపై వెంకటేశ్వరస్వామి కరుణ, కృపాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. భక్తుల తిరుమల యాత్ర విజయవంతం కావాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ నారిపెద్ది గోపాలరావు, కో కన్వీనర్ ఉప్పుటూరి వెంకట్, రావినూతల రామకృష్ణ, శ్రీవారి భక్తులు పాల్గొన్నారు.

సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన శిద్దా సుధీర్



సజ్జల రామకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న శిద్దా సుధీర్

ఒంగోలు: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ శిద్దా సుధీర్‌కుమార్ శుక్రవారం తాడేపల్లిలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం బాపట్ల ఎంపీ నందిగం సురేష్, శాసనమండలి సభ్యుడు లేళ్ల అప్పిరెడ్డి, తలసిల రఘురాంలను మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రజానాట్యమండలి క్యాలెండర్ ఆవిష్కరణ

చీమకుర్తి: లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చలువాది బదరీనారాయణ, డాక్టర్ బీ జవహర్ చేతుల మీదుగా శుక్రవారం ప్రజానాట్యమండలికి చెందిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ.. కళ కోసం కాదని, ప్రజల ప్రగతి కోసం, ప్రజలను చైతన్యం చేయడం కోసమని అన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకుడు పొత్తూరి సురేష్, స్థానికులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత చాలా అవసరం



కళాజాతా ద్వారా అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

నాగులుప్పలపాడు: ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో బ్యాంకు ఖాతా కలిగిన ప్రతి వ్యక్తి ఆర్థిక అక్షరాస్యతతో పాటు గోప్యత కలిగి ఉండటం చాలా అవసరమని నాగులుప్పలపాడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ కిషోర్‌రెడ్డి అన్నారు. పోతవరం గ్రామంలో బ్యాంకు ఖాతాదారులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. అపరిచిత వ్యక్తులతో బ్యాంకు లావాదేవీల గురించి చర్చించకుండా కేవలం బ్యాంకు సిబ్బందితోనే వివరాలు తెలియజేయాలన్నారు. అలాగే నెట్ బ్యాంకింగ్‌తో సేవలను సులభతరం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా మొదట కళాకారులతో అవగాహన జాతా నిర్వహించారు. బ్యాంకు సిబ్బంది ఆశీర్వాదకుమార్ తదితరులు పాల్గొన్నారు.

2025 నాటికి టీబీని అంతమొందిద్దాం

- జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్



వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న క్షయ వ్యాధి జిల్లా అధికారి సురేష్‌కుమార్

ఒంగోలు రూరల్: 2025 సంవత్సరం నాటికి టీబీ వ్యాధిగ్రస్తులు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ సురేష్‌కుమార్ అన్నారు. ఒంగోలులోని త్రోవగుంటలో జిల్లా వైద్యాధికారుల బృందం నిర్వహిస్తున్న టీబీ ర్యాండమ్ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సబ్ నేషనల్ సర్వేలో 2015 నుంచి 2020 వరకు క్షయ వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గిందా.. పెరిగిందా..? అనే విషయాన్ని గుర్తిస్తామన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు దీర్ఘకాలిక మందులివ్వడం ద్వారా పూర్తిగా నయమవుతుందన్నారు. రిమ్స్ సహాయ ప్రొఫెసర్ డాక్టర్ రాజుతో మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలలో శరీరం వేగంగా బలహీనమై జ్వర సూచనలతో పాటు దగ్గుతో ఏ పనీ చేయలేకపోవడం ప్రాథమిక లక్షణమని అన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకే నూతన వైద్యులతో కలిసి త్రోవగుంటలో సర్వే చేస్తున్నట్లు చెప్పారు. 15 రోజుల పాటు ఈ సర్వే జరుగుతుందన్నారు. టీబీ డిస్ట్రిక్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రత్నకుమారి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో టీబీ సర్వే జరుగుతోందన్నారు. అనుమానితులు స్వయంగా వచ్చి పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రాథమిక దశలోనే పూర్తిగా నయం చేసే అవకాశం ఉందన్నారు. స్థానిక వైద్యుడు రాకేష్‌కుమార్ మాట్లాడుతూ ఒంగోలు పరిసర ప్రాంతాల్లో, ఇండస్ట్రియల్ ఏరియాలో, ఇటుక బట్టీ కార్ఖానాలలో సర్వే వేగంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విశాల్, డాక్టర్ అషితా, డాక్టర్ రాకేష్, డీపీఎస్ సురేష్‌బాబు, ఎస్‌టీఎస్ చంద్రమౌళి, వైద్యారోగ్య సిబ్బంది రోహిణికుమారి, కరీమా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. సర్వే నిర్వహిస్తున్న సమయంలో ఒంగోలు నగర కమిషనర్ ఆకస్మికంగా సందర్శించి పలు సలహాలు, సూచనలు చేశారు.

రీ సర్వేలో అంతరాయాలను అధిగమిస్తాం



గుండ్లాపల్లి వద్ద డ్రోన్ ఎగురవేస్తున్న సర్వే ఆఫ్ ఇండియా సిబ్బంది

మద్దిపాడు: జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రీ సర్వే కార్యక్రమంలో చిన్నచిన్న లోపాలను అధిగమిస్తూ ముందుకు సాగుతున్నామని మండల ఇన్‌చార్జి సర్వేయర్ సునీల్ తెలిపారు. శుక్రవారం ఉదయం మండలంలోని గుండ్లాపల్లి, వెంకటేశ్వరపురం గ్రామాల్లో సర్వే ఆఫ్ ఇండియా సిబ్బంది బాలరాజు, జిల్లా డ్రోన్ టీమ్ సిబ్బంది విష్ణువర్ధన్, ఇసాక్ డ్రోన్ ఎగురవేశారు. ఈ సందర్భంగా మండల ఇన్‌చార్జి సర్వేయర్ మాట్లాడుతూ డిసెంబర్ చివరి నాటికి అన్ని గ్రామాల్లో డ్రోన్ ఎగురవేసినట్లు తెలిపారు. కానీ, డ్రోన్ తీసిన చిత్రాలు అసంపూర్ణంగా ఉండటం వలన గుండ్లాపల్లి, వెంకటేశ్వరపురం, మల్లవరం, నేలటూరు గ్రామాల్లో డ్రోన్ రీఫ్లై చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఫీల్డ్‌లోకి గ్రామ సర్వే టీం వెళ్తుందని, పూర్తిస్థాయిలో భూమి వాస్తవ హక్కులున్న రైతులకు రికార్డులలో నమోదు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్వేయర్లు శివశంకర్, శివమోహన్, జడా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ



ఆర్.ఎల్.పురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రమణమ్మ



నిప్పట్లపాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

చీమకుర్తి: మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామంలో స్థానిక సర్పంచ్ పుల్లగూర రమణమ్మ చేతుల మీదుగా శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు. నిప్పట్లపాడు పంచాయతీలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు చిన్నపురెడ్డి వెంకటరెడ్డి, సర్పంచ్ రావులపల్లి కోటేశ్వరరావు చేతుల మీదుగా అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.2,500 నుంచి రూ.2,750కు పెంచిన పింఛన్లను పంపిణీ చేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు విడతల వారీగా పింఛన్లను పెంచుకుంటూ పోతున్నారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా మూడోసారి పింఛన్లను పెంచారని వివరించారు. లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకుని సీఎం వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు.

గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయండి



జగనన్న కాలనీలను పరిశీలిస్తున్న ఒంగోలు మండల స్పెషల్ ఆఫీసర్, హౌసింగ్ డీఈ

- ఒంగోలు నగర కమిషనర్, మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఇళ్లు లేని నిరుపేదలకు గృహ వసతి కల్పించేందుకు ఇళ్ల పట్టాలు అందజేసిందని, లబ్ధిదారులు వేగంగా గృహాలు నిర్మించుకోవాలని ఒంగోలు నగర కమిషనర్, మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు సూచించారు. సర్పంచ్ సౌజన్య అధ్యక్షతన, కార్యదర్శి ఆశీర్వాదం కన్వీనర్‌గా మండలంలోని గుండాయపాలెంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అందజేసిన ఇళ్ల స్థల పట్టాల్లో ప్రభుత్వ, బ్యాంకుల ఆర్థిక సాయంతో గృహాలు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు మీనమేషాలు లెక్కించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా గృహాలు నిర్మించుకునేందుకు తగు ఏర్పాట్లు చేసుకోవాలని, లేకుంటే పట్టాలు రద్దు చేసి అర్హులైన ఇతరులకు కేటాయిస్తామని అన్నారు. జగనన్న కాలనీల్లో యుద్ధప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం వసతులు కల్పించిదన్నారు. ఒక్కో కాలనీకి లక్షల రూపాయలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఇప్పటికైనా సచివాలయ సిబ్బంది, హౌసింగ్ అధికారులు, కార్యదర్శులు ప్రతి లబ్ధిదారుడిని సంప్రదించి గృహాలు ఎందుకు నిర్మించుకోవడం లేదనే విషయాన్ని తెలుసుకుని వారికి అవగాహన కల్పించాలన్నారు. హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన స్థలాల్లో గృహ నిర్మాణం చేపట్టని పక్షంలో స్థలాలను వెనక్కు తీసుకునేందుకు ప్రభుత్వం పూర్తి హక్కులు కలిగి ఉందన్నారు. వాటిని అర్హులైన మరో లబ్ధిదారులకు ఇచ్చేందుకు కూడా వెనకాడేది లేదని స్పష్టం చేశారు. తొలుత సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అర్హులకు చేరే విధంగా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. సమయపాలన, మూమెంట్ రిజిష్టర్ చక్కగా పాటించాలని హితవు పలికారు. గుండాయపాలెంలో సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణాలను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ ఏఈకి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఏఈ పృథ్వీ, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, డ్వాక్రా గ్రూపు మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన మహేశ్వరుడు



మార్కాపురం: ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న శివపార్వతులు



పొదిలి: స్వామి వారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

మార్కాపురం టౌన్: పుష్యమాసం పౌర్ణమి సందర్భంగా శివాలయంలో శుక్రవారం శంకరుడు పార్వతీ సమేతుడై ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. ప్రతి ఏడాది పుష్యపౌర్ణమి సందర్భంగా మహేశ్వరుడు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిస్తాడు. అనంతరం స్వామివారి జన్మనక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకుని ఆలయంలో అన్నాభిషేకంను నిర్వహించారు. నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు జరిగింది. ఈవో చెన్నకేశవరెడ్డి, చైర్మన్ కేశవరావు, ధర్మకర్తల ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ, పలువురు కౌన్సిలర్‌లు స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆంజనేయశర్మ, తేజ శర్మలు స్వామివారికి అభిషేకాలు, పూజలు చేశారు.

ఈశ్వరుని ద్వార దర్శనం

పొదిలి: స్థానిక శ్రీ నిర్మమహేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్రోత్సవాలు ఘనంగా జరిగాయి. ముందుగా బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో నందీశ్వర సేవలు చేశారు. శివుని పుట్టిన నక్షత్రాన్ని ఉద్దేశించి ఆరుద్రోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అలంకరించిన తేరుపై శివపార్వతులను ప్రధాన ద్వారం వద్ద ఊరేగింపుగా తీసుకవచ్చారు. రామ్మూర్తి ఆధ్వర్యంలో పూజారులు సుధాకర్, వాసు, సుబ్బ నరసయ్య కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సాఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు యక్కల శేషగిరిరావు, అప్పల శంకర్ గురుస్వామి, మాకినేని అమరసింహం, ఎండోమెంట్ అసిస్టెంట్ కాటూరి ప్రసాద్ పాల్గొన్నారు.

ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు



గ్రామోత్సవంలో శివపార్వతులు

నాగులుప్పలపాడు: ధనుర్మాసం సందర్భంగా ఉప్పుగుండూరు గ్రామంలోని శ్రీ ఆళ్వారాజుల రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రధాన పూజారి దివి శ్రీధర్‌బాబు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతగా హౌసింగ్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కొలకలూరి విజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్టు చైర్మన్ పెంట్యాల జ్యోతి శ్రీనివాసరావు ఉభయదాతలను ప్రత్యేకంగా సత్కరించారు. శివాలయంలో శివ ముక్కోటి సందర్భంగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. అనంతరం స్వామివారికి సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.